# ప్రజాశక్తి

సోమవారం 6 ఫిబ్రవరి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి




# ముందుకు సాగని జగనన్న ఇళ్లు

పరవాడలో ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం నేత లోకనాథం

◆ 53 రోజుల్లో 48,417 గృహాల నిర్మాణం పూర్తయ్యేనా..

◆ నిర్దేశిత లక్ష్యాన్ని గృహ నిర్మాణ సంస్థ చేరుకునేనా..

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

**జిల్లాలో జగనన్న ఇళ్లు ముందుకు సాగడం లేదు. గృహ నిర్మాణ లక్ష్యం చేరుకోవడానికి 53 రోజులు వున్నాయి. ఈ గడువులోగా 48,417 ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి. రోజుకు 913 ఇళ్లు చొప్పున పూర్తయితేగానీ మార్చి నాటికి గృహ నిర్మాణ లక్ష్యం చేరుకోవడం సాధ్యంకాదు.**

జిల్లాలోని 24 మండలాలు, అనకాపల్లి పట్టణ కేంద్రం, యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాల్టీలకు 53,567 ఇళ్లు మంజూరయ్యాయి. ఈ ఇళ్ల నిర్మాణాలను 2023 మార్చి నాటికి పూర్తిచేయాలని గృహ నిర్మాణ సంస్థకు ప్రభుత్వం లక్ష్యం విధించింది. లక్ష్యం ఘనంగా వున్నా, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న 1.80 లక్షలు పునాదులకు దాటి రాకపోవడంతో అదనంగా డబ్బు పెట్టి ఇళ్లు నిర్మించుకోలేని పేదలు ఆసక్తి చూపడంలేదు. జిల్లాలోని చోడవరం, మాడుగుల, అనకాపల్లి, పెందుర్తి, పాయకరావుపేట, యలమంచిలి, నర్సీపట్నం నియోజకవర్గాల్లోని 787 లే అవుట్లు , సొంత స్థలాల్లో కలిపి 53,567 ఇళ్లను ప్రభుత్వం కొన్ని నెలల క్రితం మంజూరుచేసింది. వీటిలో 5150 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 1691 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. బిబిఎల్ స్థాయిలో 30,602, బిఎల్ దశలో 9894, రూఫ్ లెవల్‌లో మిగతా 2లో..

## ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలి : సిపిఎం

**ప్రజాశక్తి - పరవాడ:** జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ప్రతి ఇంటికీ ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. పరవాడలోని జగనన్న గృహ నిర్మాణాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జగనన్న గృహాలకు ప్రభుత్వం ఇస్తున్న బడ్జెట్‌ను పెంచాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న నిధులు నిర్మాణాలకు సరిపోక పలువురు అప్పులు చేస్తున్నారని తెలిపారు. ఇనుము, రాయి, ఇటుకులు తదితర ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం నిర్మితమవుతున్న గృహాలకు వెంటనే బిల్లులు విడుదల చేయాలన్నారు. కాలనీల్లో రోడ్లు, కాలువలు, వీటి దీపాలు వంటి అన్ని సౌకర్యాలూ ఉండాలని కోరారు. ప్రజలకు ఎటువంటి సమస్యా తలెత్తరాదన్నారు. ఆయన వెంట సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఉన్నారు.




అనకాపల్లిలో సంకల్ప దీక్ష చేపట్టిన యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

# సిపిఎస్ రద్దు చేయాల్సిందే..

## యుటిఎఫ్ సంకల్ప దీక్షల్లో వక్తలు

**సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ యుటిఎఫ్ ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆదివారం ఉపాధ్యాయులు సంకల్ప దీక్షలు చేపట్టారు. ఉపాధ్యాయుల ఉద్యమం పట్ల ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలని నినదించారు.**

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)**

సిఎం జగన్ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందేనని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యుటిఎఫ్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ సంకల్ప దీక్ష నిర్వహించారు. దీక్షా శిబిరానికి మద్దతు తెలుపుతూ ఆమె మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసినపుడు తాము అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు పూర్తయినప్పటికీ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. పైగా జిపిఎస్ విధానాన్ని తెర మీదకు తీసుకురావడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్న ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడడం ప్రభుత్వానికి తగదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల పాలకులు అమానుషంగా వ్యవహరించడం మిగతా 2లో..






దీక్షా శిబిరంలో చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

# 'ఉక్కు' దీక్షల్లో చిన్నారులు

మహత్తర పోరాటంలో భాగస్వామ్యం

వార్త మెయిన్‌లో...

# స్వాతంత్ర్య స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

◆ సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్ ◆ విశాఖలో స్వరాజ్య స్ఫూర్తి @ 75 పుస్తకావిష్కరణ

**ప్రజాశక్తి - సీతమ్మధార :** నేడు స్వాతంత్ర్యోద్యమ చరిత్రను మరిచిపోతున్నామని, అలా కాకుండా ఆ స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్ అన్నారు. రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన స్వరాజ్య స్ఫూర్తి @ 75 పుస్తకావిష్కరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం సంకలనకర్త రామినాయుడును అభినందిస్తూ తొలి ప్రతిని గరిమెళ్ళ మనవడు అశోక్ లక్ష్మణకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ ఉద్యమ చరిత్రలో పోరాటం ఉందని, అలా పోరాటం చేసిన వారు నవ స్వాతంత్ర్య భారతంలో గుర్తింపు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన ఐదేళ్ల తర్వాత గరిమెళ్ళ సత్యనారాయణ, కొండ వెంకటరావు వంటి వారిని గుర్తించలేదని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ చనిపోయారని తెలిపారు. జిడిపి పెరిగిందని గొప్పగా చెప్పుకుంటున్నారని, నాటి విలువలు పెరిగాయా ? అన్నది అందరూ సమీక్షించుకోవాలని అన్నారు. అనేక గొప్ప ఆదర్శాలు జాతీయ ఉద్యమంలో ఉన్నాయని, వాటిని గుర్తించకుండా దండయాత్ర వల్ల దేశం నాశనం అయిపోయిందని ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రస్తుత మత తీవ్రవాద శక్తుల వల్ల గాంధీయ మిగతా 2లో..



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కె.శ్రీనివాస్ తదితరులు

## మొదటి పేజీ తరువాయి..

### ముందుకుసాగని జగనన్న ఇళ్లు

2681, స్లాబ్‌లు పూర్తయినవి 3549 వున్నాయి.

ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు, పూర్తయిన నిర్మాణాలు మండలాల వారీగా

| మండలం | ఇళ్లు మంజూరు | పూర్తయినవి |
|---|---|---|
| అనకాపల్లి అర్బన్ | 3621 | 139 |
| అనకాపల్లి రూరల్ | 3096 | 128 |
| అచ్యుతాపురం | 1517 | 204 |
| బుచ్చెయ్యపేట | 2244 | 103 |
| చీడికాడ | 1807 | 56 |
| చోడవరం | 2790 | 164 |
| దేవరాపల్లి | 1891 | 59 |
| యలమంచిలి | 996 | 116 |
| యలమంచిలి అర్బన్ | 1636 | 364 |
| గొలుగొండ | 1751 | 82 |
| కె.కోటపాడు | 2084 | 87 |
| కశింకోట | 2144 | 379 |
| కోటవురట్ల | 1350 | 115 |
| మాడుగుల | 2530 | 117 |
| మాకవరపాలెం | 1225 | 85 |
| మునగపాక | 1001 | 160 |
| నక్కపల్లి | 2608 | 217 |
| నర్సీపట్నం | 1076 | 64 |
| నర్సీపట్నం అర్బన్ | 2890 | 440 |
| నాతవరం | 2029 | 122 |
| పరవాడ | 957 | 309 |
| పాయకరావుపేట | 2976 | 361 |
| రాంబిల్లి | 1247 | 241 |
| రావికమతం | 2053 | 152 |
| రోలుగుంట | 1846 | 128 |
| ఎస్.రాయవరం | 2122 | 306 |
| సబ్బవరం | 2080 | 452 |

### స్వాతంత్య్ర స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

వాదులు ఒకవైపు నిలబడుతున్నారని తెలిపారు. ఇటువంటి తరుణంలో స్వరాజ్య స్ఫూర్తి @ 75 వంటి సంకలన పుస్తకం ఎంతో అవసరమన్నారు. పుస్తక సంకలనకర్త రామినాయుడు మాట్లాడుతూ ఇప్పటి తరానికి నాటి మహనీయులు స్వాతంత్ర్య ఉద్యమంలో పడిన కష్టాలను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత డాక్టర్ డివి.సూర్యారావు, రచయిత శ్రీనివాసరావు, రైటర్స్ అకాడమీ అధినేత వివి.రమణమూర్తి, పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డి.వర్మ తదితరులు పాల్గొన్నారు.



విశాఖలో దీక్షల్లో కూర్చున్న యుటిఎఫ్ నాయకులు

### సిపిఎస్ రద్దు చేయాల్సిందే..

సరికాదన్నారు. దీక్షల్లో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, తాడాన అప్పారావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.పైడిరాజు, కోశాధికారి టిఆర్.అంబేద్కర్, జిల్లా కార్యదర్శి చుక్క సత్యం, ఉప్పాడ రాము, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.రామకృష్ణ, మహిళా నాయకులు ఎ.విజయకుమారి, మండల నాయకులు బాలరాజు, సంతోష్, రమేష్ కుమార్, రెడ్డి పాల్గొన్నారు.

**అనకాపల్లి :** ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు కూడా చెల్లించకపోవడం సిగ్గుచేటని యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి విమర్శించారు. స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆదివారం యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంకల్ప దీక్ష చేపట్టారు. ముందుగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు నెల్లి సుబ్బారావు ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన శిబిరాన్ని ఉద్దేశించి చిన్నబ్బాయి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 117 ద్వారా ప్రాథమిక విద్యను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రజాస్వామ్యాన్ని జగన్మోహన్ రెడ్డి అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కులను కాలరాస్తూ పోలీస్ నిర్బంధాలతో వేధింపులే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నాయకులు గంటా శ్రీరామ్, బొప్పే ఉమామహేశ్వరరావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు అజయ్ కుమార్ దీక్షా శిబిరం వద్దకు చేరుకొని తమ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జికెఆర్.స్వామి, ఎల్లయ్య బాబు, ఉపాధ్యక్షులు పొలిమేర చంద్రరావు, కార్యదర్శి జి.అప్పలరాజు, ఆడిట్ కన్వీనర్ వెంకటరావు, మండల నాయకులు నూకరాజు, కామరాజు, రాణి, రవి, శ్రీనివాసరాజు, జయ నాయక్, శాంతి దేవి, ఉమాదేవి, రామలక్ష్మి, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

# ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి..?

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రధాని మోడీ హామీ ఏమైందని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఎపికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. ఆదివారం అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల ఎంపీలు పార్లమెంట్‌లో పోరాడి నిధులు కేటాయింపునకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర విభజన జరిగి 8 సంవత్సరాలు పూర్తయినా ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా ఆంధ్రప్రదేశ్‌ను మోడీ మరోసారి మోసం చేశారన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల అభివృద్ధికి, కడప ఉక్కు ఫ్యాక్టరీ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకూ ఒక్క పైసా విదల్చలేదని అన్నారు. సౌత్ కోస్టు రైల్వే జోన్‌కు రూ.10 కోట్లు కేటాయించి గొప్పగా చెప్పుకోవడం తగదన్నారు. అనేక ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసి వందే భారత్ రైలు ఒకటి ఇవ్వడమే అభివృద్ధిగా బిజెపి నాయకులు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిజెపి నాయకులు, రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావుకు దమ్ముంటే కేంద్రంపై పోరాడి ఆంధ్రప్రదేశ్‌కి నిధులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్ బాబు

సాధించాలని కోరారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటుపరం కాకుండా ఆయన ఎందుకు కృషి చేయడం లేదని ప్రశ్నించారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాసంస్థల ఏర్పాటుకు నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఎన్నికల రాజకీయాలు మానుకొని దేశంలో ప్రతి రాష్ట్ర అభివృద్ధికీ కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐవైఎఫ్ విశాఖ జిల్లా కన్వీనర్ రాంబాబు, కో కన్వీనర్ మధురెడ్డి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం, విశాఖ జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు. ఈ నెల 19న 411 ఎస్ఐ పోస్టులకు ప్రిలిమ్స్ పరీక్ష జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 13న తమ సంఘం ఆధ్వర్యాన మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు నాయకులు తెలిపారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆకట్టుకుంటున్న 'దిశ' స్టాల్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** 'షీ ఈజ్ ఏ చేంజ్ మేకర్' ప్రాజెక్టులో భాగంగా 11 రాష్ట్రాలకు చెందిన 50 మంది మహిళా ఎమ్మెల్యేలతో విశాఖపట్నంలో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగుతున్న వర్క్‌షాప్‌లో మహిళా రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ ప్రారంభించిన దిశ సంబంధిత కార్యాక్రమాలను వివరిస్తూ విశాఖపట్నం నగర పోలీసులు ఏర్పాటు చేసిన దిశ స్టాల్ మహిళా ప్రతినిధులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. దిశ అప్లికేషన్ డౌన్లోడ్, రిజిస్ట్రేషన్, ఎస్ఓఎస్ పనితీరును వివరిస్తూ ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌ను తిలకించేందుకు పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. దేశంలో మహిళా రక్షణ కోసం ప్రవేశపెట్టిన ఒక అప్లికేషన్‌కు స్వల్ప వ్యవధిలో



దిశ స్టాల్ వద్ద ఎమ్మెల్సీ కల్యాణి

1,11,38,538 మంది తమ సెల్ ఫోన్ నెంబర్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోవడం గొప్ప విషయమని పలువురు ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా ఎమ్మెల్యేలు, ఎపి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఈ స్టాల్‌ను సందర్శించిన వారిలో ఉన్నారు.

### పలు ప్రత్యేక రైళ్లు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హటియా - మంగళూరు సెంట్రల్ - హటియాలను మధ్య వారాంతపు ప్రత్యేక రైళ్ళు నడపాలని రైల్వే నిర్ణయించింది. 08645 హటియా - మంగళూరు సెంట్రల్ వీక్లీ స్పెషల్ రైలు ఈ నెల 6 నుండి 27 వరకు ప్రతి సోమవారం ఉదయం 4.50 గంటలకు హటియా నుండి బయలుదేరి, అదే రోజు రాత్రి 20:43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. మరలా 20:45 గంటలకు బయలుదేరి మూడో రోజు బుధవారం ఉదయం 04.15 గంటలు మంగళూరుకు చేరుకుంటుంది. 08646 మంగళూరు సెంట్రల్ - హటియా వీక్లీ స్పెషల్ ఫిబ్రవరి 9 నుండి మార్చి 3వ తేదీ వరకు ప్రతి గురువారం ఉదయం 4.00 గంటలకు మంగళూరు నుంచి బయలుదేరి రెండో రోజు అర్ధ రాత్రి 12:08 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 12: 10 గంటలకు బయలుదేరి మూడో రోజు శనివారం ఉదయం 04.30 గంటలకు హటియా చేరుకుంటుంది. ఈ రైళ్ళు రూర్కెలా, జార్సుగూడ, సంబల్‌పూర్, బార్‌గఢ్ రోడ్, బలంగీర్, టిట్లాగఢ్, కేసింగ, మునిగూడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం, విజయనగరం, కడవలి పట్టణం. బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పేటై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పోదనూరు, పాలక్కాడ్, షోరనూర్, కొజికోడ్, తలస్సేరి, కన్నూర్, కాసరగోడ్ స్టేషన్లలో ఆగుతాయని అధికారులు తెలిపారు.

## ముస్లిములకు రాజకీయ అవకాశాలు కల్పించాలి

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిములకు అన్ని పార్టీలూ రాజకీయ ప్రాతినిథ్యం కల్పించాలని ముస్లిం రాజకీయ చైతన్య వేదిక రాష్ట్ర కన్వీనర్ హసన్ షరీఫ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో ముస్లింలు పది శాతం ఉన్నారని చెప్పారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు ఉన్న ఏ ఒక్క నియోజకవర్గంలోనూ ముస్లిం శాసనసభ్యులు లేరని తెలిపారు. జనాభా దృష్ట్యా తమకు రాష్ట్రంలో 18 శాసనసభ, 3 పార్లమెంటు స్థానాల్లో అవకాశం కల్పించాలని కోరారు.

## నేవీ ఉద్యోగుల హెల్త్ వాక్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించడానికి నేవీ ఉద్యోగులకు ఆదివారం హెల్త్ వాక్ కార్యక్రమం చేపట్టారు. సుమారు 150 మంది నావికా సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ హెల్త్ వాక్ డాల్ఫిన్ స్పోర్ట్స్ గ్రౌండ్ నుంచి ఐఎన్ఎస్ వీరబాహు వరకూ ఆరు కిలోమీటర్ల మేర సాగింది.

# 'పాప్ కార్న్' చిత్ర బృందం సందడి

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)**

ఆచార్య క్రియేషన్స్ బ్యానర్‌పై సాయి, అవిక గౌర్ హీరో, హీరోయిన్లుగా భోగేంద్ర గుప్తా నిర్మాణంలో మురళీ గంధం దర్శకత్వం వహించిన పాప్‌కార్న్ మూవీ ఈ నెల 10న విడుదల కానుందని చిత్ర యూనిట్ తెలిపింది. ఆదివారం సాయంత్రం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దర్శకులు మురళీ గంధం మాట్లాడుతూ ఒక డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ మూవీని తీశామన్నారు. ఆడియన్స్‌కి ఈ చిత్రం ఒక కొత్త అనుభూతినిస్తుందన్నారు. సినిమా చాలా వరకూ లిఫ్టులో కొనసాగుతుందని అన్నారు. హీరో, హీరోయిన్లు 18 గంటలపాటు ఒక లిఫ్టులో ఇరుక్కుపోతారని, ఆ క్రమంలో లిఫ్ట్‌లో వారిద్దరి మధ్య జరిగిన సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయని వెల్లడించారు. హీరో సాయి మాట్లాడుతూ ప్రెజర్ కుక్కర్, రాజహంస వంటి పలు చిత్రాలలో హీరోగా చేసానని తెలిపారు. పాప్ కార్న్ మూవీ తనకు మంచి పేరును తీసుకొస్తుందని చెప్పారు. హీరోయిన్ అవికా గౌర్‌తో తన కెమిస్ట్రీ చాలా బాగుంటుందని పేర్కొన్నారు. ఒకే లిఫ్టులో ఇరుక్కుపోయిన తమ మధ్య జరిగే సంఘటనల సమాహారమే ఈ సినిమా అని చెప్పారు. కుటుంబం అంతా కలిసి చూసే విధంగా ఈ సినిమా ఉంటుందని అన్నారు. హీరోయిన్ అవికా గౌర్ మాట్లాడుతూ తన కెరీర్‌లోనే పాప్ కార్న్ మూవీ ఒక ప్రత్యేకమైనదని చెప్పారు. నిర్మాత భోగేంద్ర గుప్తా మాట్లాడుతూ ఈ మూవీ ద్వారా ప్రేక్షకులు ఒక కొత్త అనుభూతికి లోనవుతారని వెల్లడించారు. ఇదివరకు తమ బ్యానర్‌లో నెపోలియన్, పొలిమేర వంటి వినూత్న చిత్రాలను తీశామని చెప్పారు.

# జగనన్న కాలనీ కట్టనివ్వం

## భూమి దక్కకపోతే ఆత్మహత్య చేసుకుంటాం

## రైతుల ఆందోళన

**ప్రజాశక్తి-పద్మనాభం :** తమ భూమిలో జగనన్న కాలనీల ఇళ్లు కట్టనివ్వబోమని భూసాగుదారులు స్పష్టంచేశారు. పద్మనాభం మండలం గంధవరం రెవెన్యూ పరిధిలో జగనన్న కాలనీకి కేటాయించిన భూమి వద్ద ఆదివారం సాగుదారులు ఆందివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు లగుడు దేముడు, రాజాన రమణ, రాజాన సీత, రాజాన సోములు మాట్లాడారు. గంధవరం రెవెన్యూ పరిధిలోని కొండ ప్రాంతంలో ఎగుడుదిగుడుగా ఉన్న భూమిలో 50 సంవత్సరాల నుంచి మామిడి, జీడి, టేకు, ఇతర జాతుల చెట్లు వేసుకొని కుటుంబ పోషణ చేసుకుంటున్నామని తెలిపారు. ఈ భూమిలో ఎక్కడో ఉన్న పట్టణ ప్రజలకు ఇళ్ల స్థలాలిచ్చి తమ జీవనోపాధిని దెబ్బతీసి రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తంచేశారు. భూమిలో 50 సంవత్సరాలు పెంచిన చెట్ల ఫలసాయం ఉంటుండుగానే తొలగించారని తెలిపారు. రైతుల గోడు వినకుండా 2019లో జిల్లా అధికారులు ఇష్టానుసారం వ్యవహరించారని ఆరోపించారు. మామిడికాయలు ఉన్నాయని, నెలరోజుల తర్వాత తొలగించాలని అప్పటి జాయింటు కలెక్టర్‌గా ఉన్న సూర్యకళను కోరినట్లు తెలిపారు. ఫలసాయానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని చెప్పి జెసిబిలతో సుమారు వంద ఎకరాలు భూమిలో ఉన్న చెట్లును నేల కూల్చారని, దానికి సంబంధించి నేటికీ నష్టపరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. భూమికి కూడా నష్ట పరిహారం ఇవ్వలేదని తెలిపారు. దీనిపై కలెక్టర్, తహశీల్దార్, ఆర్‌డిఒలకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా స్పందించలేదన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి తమ భూములను రక్షించుకుంటామని స్పష్టంచేశారు. భూమి దక్కకపోతే 30 మంది రైతులమూ ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.



భూముల వద్ద ఆందోళన చేస్తున్న రైతు కుటుంబాలు



గంధవరం రెవెన్యూ పరిధిలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు

## నేరాలు ఘోరాలు

### మద్యం సీసాలు స్వాధీనం

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని విప్పలపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నామని కేడిపేట ఎస్సై సూర్యనారాయణ తెలిపారు. గ్రామానికి చెందిన కూసరపు జోగారావు మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకొని 35 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పాతకేడిపేట శివారులో అదే గ్రామానికి చెందిన విజయకుమారి సారా విక్రయిస్తుండగా దాడి చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ రెండు కేసుల్లో నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### సారా పులుపు ధ్వంసం

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం గ్రామ శివారులోని టౌన్ సిఐ నమ్మి గణేష్ ఆధ్వర్యంలో సుమారు 1500 లీటర్ల సారా బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సిఐ గణేష్ మాట్లాడుతూ, నాటు సారా అమ్మే వారిని వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. సారా తయారీ, రవాణా చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

### 54 కిలోల గంజాయి పట్టివేత

**ప్రజాశక్తి పాయకరావుపేట:** మండలంలోని పిఎల్ పురం జంక్షన్ వద్ద ఎస్సై జోగారావు తన సిబ్బంది సహాయంతో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా నామవరం నుండి తుని వెళ్తున్న అశోక్ లేలాండ్ గూడ్స్‌లో తరలిస్తున్న 54 కేజీల గంజాయితో ఇద్దరు పట్టుబడినట్లు తెలిపారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు

### పట్టుబడ్డ సెల్ దొంగ

**ప్రజాశక్తి-సీతమ్మధార :** సీతమ్మధార రైతుబజార్‌లో మొబైల్ దొంగతనం చేసిన వ్యక్తిని రైతుల పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు మాట్లాడుతూ, గత కొన్ని రోజుల నుంచి రైతు బజార్‌లో చోరీలు జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై రైతులు ప్లాన్ ప్రకారం చోరీలు చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులను అభినందించారు.

## మృతుని కుటుంబానికి నిత్యావసరాలు

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని చిప్పాడ పంచాయతీ, కొసనవానిపాలెం గ్రామానికి చెందిన తమ్మయ్య కుటుంబానికి టిడిపి నాయకులు ఆదివారం నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందజేశారు. సాయం చేసిన వారిలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు సరగడ అప్పారావు, ప్రస్తుత ఎంపిటిసి సభ్యులు సిహెచ్.ఈశ్వరమ్మ, శివాజీ, నారా లోకేష్ ఫౌండేషన్ సభ్యులు కొసన అప్పలరెడ్డి, సరగడ సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# బాలసుబ్రహ్మణ్యానికి డాక్టరేటు ప్రదానం

**ప్రజాశక్తి-పద్మనాభం :** మండలంలోని మద్ది గ్రామానికి చెందిన పురోహితుడు బాలసుబ్రహ్మణ్యానికి సియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా, ఎన్‌జిఒ సంయుక్తంగా డాక్టరేటును ప్రదానం చేశాయి. బాలసుబ్రహ్మణ్యం పౌరోహిత్యం చేస్తూ, వీధి నాటకాలు వేస్తుంటారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక ప్రదర్శనలిచ్చారు. సంప్రదాయ కళా రంగానికి సేవ చేస్తున్నందుకు ఈ డాక్టరేటును ప్రదానం చేశారు. హైదరాబాదులోని తెలంగాణా సారస్వతా భవన్‌లో బాలసుబ్రహ్మణ్యానికి ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆకుల రమేష్ ఆధ్వర్యాన తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ రామకృష్ణగౌడ్, యూనివర్సీటీ ప్రతినిధులు డాక్టరేట్‌ను అందించారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, నాటక ప్రదర్శనలలో ఎన్నో అవార్డులు అందుకున్నానని, ఇప్పుడు డాక్టరేట్ రావడం ఆనందదాయకంగా ఉందని చెప్పారు.





డాక్టరేట్ అందుకుంటున్న బాలసుబ్రహ్మణ్యం

## ముగిసిన రాపర్తి శత జయంతోత్సవాలు

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** స్థానిక కృష్ణా కాలనీ యోగా చైతన్య సంస్థ ప్రాంగణంలో యోగాచార్య డాక్టర్ రాపర్తి రామారావు పేరిట శనివారం ప్రారంభించిన శత జయంతి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సభకు ముఖ్య అతిథిగా కమిషనర్ ఆఫ్ ఇన్ కమ్ టాక్స్ విశ్రాంత ప్రిన్సిపల్ ఎం.నరసింహప్ప హాజరై మాట్లాడారు. యోగా ప్రాధాన్యతను వివరించారు. పరిపూర్ణమైన ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహద పడుతుందన్నారు.



షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

## షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

**ప్రజాశక్తి -తగరపువలస :** చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక ఆదివారం నిర్వహించారు. కృష్ణా జిల్లా, హనుమాన్ జంక్షన్ బాపులపాడులో ఫిబ్రవరి 10, 11, 12 తేదీల్లో నిర్వహించే 41వ ఎపి సీనియర్ బాలికలు, బాలురు అంతర్ జిల్లా షూటింగ్ బాల్ పోటీలకు విద్యార్థులను ఎంపిక చేశారు. జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్.రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు గణేష్ పాల్గొన్నారు.

## ఘనంగా మాఘ పౌర్ణమి

**ప్రజాశక్తి-సింహాచలం:** సింహాచలం దేవస్థానం అనుబంధ దేవాలయమైన కొండ దిగువనున్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక సుగంధ ద్రవ్యాలతో చక్రస్నానం చేసి పూర్ణాహుతి హోమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో తిరువీధి నిర్వహించారు.

# అయోధ్యనగర్‌లో కానరాని మౌలిక వసతులు



అధ్వాన్న స్థితిలో ఉన్న రహదారి



కాలనీ మధ్యలో చేరిన మురుగు నీరు

**ప్రజాశక్తి -మధురవాడ :** జివిఎంసి 5వ వార్డు పరిధి అయోధ్యనగర్ కాలనీ ఏర్పడి రెండున్నర దశాబ్దాలు అవుతున్నా కనీస మౌలిక వసతులు లేవు. కాలనీ ఏర్పాటు సమయంలో వేసిన రహదారులే నేటికీ దర్శనమిస్తున్నాయి. ఈ కాలనీ నుంచి పలు కాలనీలకు వెళ్లే అంతర్గత రహదారులు రాళ్లు తేలి ఉన్నాయి. వాహనాల రాకపోకలు చేయలేని పరిస్థితి ఉంది. పలుచోట్ల గుంతలు ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ ఉన్నప్పటికీ మురుగుపోయే మార్గం లేదు. దీంతో మురుగు నీరు కాలనీ మధ్యలో చెరువులను తపించేలా ఉంది. కాలనీలో పలుచోట్ల పార్కులకు స్థలాలు కేటాయించినా అవి అభివృద్ధికి నోచుకోలేదు. సంబంధిత అధికారులకు ఎన్ని వినతులిచ్చినా స్పందనలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి అయోధ్యనగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని పలువురు కాలనీవాసులు కోరుతున్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

అయోధ్యనగర్ కాలనీలో ఉన్న సమస్యలు తన దృష్టికి వచ్చాయి వాటిని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా పరిష్కరానికి కషి చేస్తాను. కాలనీలో పార్కులు, విధిదీపాలు, డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధికి ప్రయత్నిస్తాను.



**హేమలత**

**5వ వార్డు కార్పొరేటర్**

# కొండ కాదు.. డంపింగ్ యార్డు..



## వారం రోజులుగా తరలింపునకు నోచని చెత్త దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి -గాజువాక : రాసా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్లక్ష్యంతో గాజువాక రామచంద్రనగర్ డంపింగ్‌యార్డులో చెత్త పేరుకుపోయింది. రామచంద్రనగర్ డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను వారం రోజులుగా తొలగించకపోవడంతో అక్కడ కొండలా తయారైంది. గాజువాక పరిధిలో ఉన్న ప్రతి ఇంటి నుంచీ సేకరించిన చెత్తను ముందుగా ఈ డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి కాపులుప్పాడకు తరలించడానికి రాసా సంస్థకు జీవీఎంసీ అధికారులు కట్టబెట్టారు. రోజుకు 15 టన్నుల చెత్తను రామచంద్రనగర్ డంపింగ్ యార్డు నుంచి కాపులుప్పాడ తరలించడానికి ఐదు హాంకులోడర్స్ ఏర్పాటుచేశారు. వారం రోజులుగా ఈ చెత్తను తరలించకపోవడంతో సుమారు వెయ్యి టన్నుల మేర పేరుకు పోయింది. దీని ద్వారా వచ్చే దుర్వాసనతో రామచంద్రనగర్, రిక్షాకాలనీ, స్వతంత్రనగర్, నడుపూరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి విపరీతంగా వీచే సమయంలో ప్రజలు ఊపిరి పీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ రహదారి వెంబడి స్టీల్‌ప్లాంట్‌కి వెళ్లే కార్మికులు కూడా దుర్వాసన భరించలేక వేరే రహదారిలో ప్రయాణిస్తున్నారు. చెత్త తరలింపు నిర్లక్ష్యంలో రాసా సంస్థ పై జీవీఎంసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వారిపై చర్యలు తీసుకోకపోగా జీవీఎంసీ సొంత వాహనాలతో డంపింగ్ యార్డులోని చెత్తను తొలగించడం ఎంతవరకు సమంజసం అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. డబ్బులు ప్రయివేటు వారికిచ్చి, పనులు జివిఎంసి వాహనాలతో చేయిస్తారా అంటూ మండిపడుతున్నారు. ఇళ్ల పన్నులు పెంచి, కొత్తగా చెత్త పన్నులు వేసి ఈ విధంగా దుబారా చేయడానికి అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉద్యమం చేయడానికి సిపిఎం నాయకులు సిద్ధంగా ఉన్నారు. స్థానిక ఎఎంహెచ్ఒ కిరణ్‌ను వివరణ కోరగా, ఆ సంస్థ వాహనాలు మరమ్మతుకు గురికావడంతో చెత్త తరలించడం లేదని, ప్రత్యామ్నాయ వాహనాలను ఏర్పాటుచేయాలని నోటీసులు జారీ చేశామని తెలిపారు.

### విపరీతమైన దుర్వాసన

రామచంద్రనగర్ డంపింగ్ యార్డు నుంచి చెత్తను తొలగించకపోవడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. ఈ డంపింగ్ యార్డు ఏర్పాటును గతంలోనే సిపిఎం వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు చెత్తను తొలగించకుండా ఇబ్బందులు పెడుతున్నారు.

డి.రమణ
సిపిఎం నాయకులు



బాధితునికి ఆర్థిక సహాయం అందిస్తున్న మజ్జి మాలినాయుడు

## గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి గుడివాడ అప్పన్న కాలనీకి చెందిన తాపీ మేస్త్రి సింహాచలం కాలు విరిగి గాయాలపాలుకావడంతో ఆ కుటుంబానికి దుర్గ గణేష్ ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ (డిజిఎఫ్) ఆధ్వర్యాన ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మజ్జి మాలినాయుడు మాట్లాడుతూ, సింహాచలం గాయాలుపాలై ఇంటికే పరిమితం కావడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని తెలుసుకొని డిజిఎఫ్ సభ్యుల సహకారంతో సహాయం చేసినట్లు తెలిపారు. తమ సంస్థ పేద ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. ఆ కుటుంబానికి నిత్యవసర సరుకులు, రూ.5,000 అందజేసినట్లు తెలిపారు.




'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

## 10వ వార్డులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యాన ఆదివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని చేపట్టారు. వివేకానందనగర్, ఆదర్శనగర్, నాగేశ్వరరావుపేట ప్రాంతాల్లో ఇంటింటికీ స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్, టిడిపి నాయకులు వెళ్లి సమస్యలనడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను, పెరిగిన ధరలు, బస్సు ఛార్జీలు తదితరాలను స్థానికులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మద్దిల రాజశేఖర్, ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవిందు, పోలరావు, గాడు అప్పలనాయుడు, కేత సత్యనారాయణ, ముగడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీచేస్తున్న ఎస్ఐ శ్యామ్‌సుందర్

## నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-ఆనందపురం : జై జవాన్ ఫౌండేషన్, వాకర్స్ 20-20 టీమ్ ఆధ్వర్యాన ఆనందపురంలో 100 మంది పేద పిల్లలకు నోటు పుస్తకాలు, ఇతర స్టేషనరీని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆనందపురం ఎస్ఐ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ, విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పిల్లలను విద్యావంతులను చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టిన జై జవాన్ ఫౌండేషన్ టీమ్‌కు, వాకర్ 20-20 టీమ్‌ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్యామ్‌సుందర్‌ను, ఆంధ్రప్రభ సీనియర్ జర్నలిస్టు డబ్బీరు విజయకుమార్‌ను జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుప్పు రాజశేఖర్ సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ 20- 20 టీమ్ ప్రెసిడెంట్ బివిఎస్.శేఖర్, సెక్రెటరీ ఎం.నాగేశ్వరరావు, ట్రెజరర్ జి.రామునాయుడు, వి.మధుసూదనరావు, జై జవాన్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, సెక్రెటరీ ముడసల కార్తీక్, ట్రెజరర్ కుప్పు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికులు చురుకైన పాత్ర పోషించాలి

### విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో కాంట్రాక్టు కార్మికులు చురుకైన పాత్ర పోషించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 724వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ వివిధ విభాగాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరిగితే ముందుగా నష్టపోయేది కాంట్రాక్టు కార్మికులేనన్నారు. నిర్వాసిత ప్రాంతాల్లో జరిగే పోరాటాలలోనూ కాంటాక్టు కార్మికులు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. దీక్షా శిబిరంలో ఎఐటియుసికి చెందిన కాంట్రాక్ట్ కార్మికులు కూర్చున్నారు.

## గంగవరం పోర్టు కాలుష్యంపై నేడు సిపిఎం నిరసన

ప్రజాశక్తి- గాజువాక : గంగవరం పోర్టు కాలుష్యాన్ని నివారించాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన వై జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టనున్నట్లు పార్టీ జోన్ కార్యదర్శి ఎమ్.రాంబాబు తెలిపారు. ఉదయం 8గంటలకు చేపట్టే ఈ కార్యక్రమానికి రామచంద్రనగర్, రిక్షాకాలనీ, బర్మా కాలనీ, స్వతంత్ర నగర్ ప్రజలు హాజరుకావాలి కోరారు.

## ఒత్తిడి నివారణకు విహారయాత్రలు దోహదం

ప్రజాశక్తి -ములగాడ : ఒత్తిడి నివారణకు విహారయాత్రలు దోహదపడతాయని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి తెలిపారు. సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు విశాఖలోని శిల్పారామం, భీమిలి, కైలాసగిరి, బీచ్ రోడ్డు తదితర ప్రదేశాలను సందర్శించి, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, నిరంతరం చదువు, పరీక్షలతో, వివిధ పోటీలతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారని, వారికి విహారయాత్రలు ఏర్పాటుచేయడం మంచిదని అభిప్రాయపడ్డారు. ఈ విహారయాత్రను డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిల్ సిస్టర్ జానీస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ విహారయాత్రకు బిపి.రాజు, సలోమి, భాగ్యలక్ష్మి, అనసూయ, అబిదా నాయకత్వం వహించారు.



విహారయాత్రలో పాల్గొన్న ఇపిఎస్.భాగ్యలక్ష్మి తదితరులు

## ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ ఆత్మీయ కలయిక



కంబాలకొండలో కలుసుకున్న ప్రయివేటు స్కూల్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ విశాఖపట్నం సభ్యులు ఆదివారం కంబాలకొండలో ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ విశాఖపట్నం ప్రెసిడెంట్ జె.సోమశేఖర్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమానికి ప్రయివేటు స్కూల్స్ కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్ హాజరయ్యారు. ప్రయివేటు స్కూళ్ల ఐక్యత కోసం అందరూ కృషిచేయాలని, 2023లో అత్యధిక మెంబర్‌షిప్ చేర్పించాలని ఈ సందర్భంగా సోమశేఖర్ పిలుపునిచ్చారు.

## ఫార్మాలో ఉద్యోగాలకు 9న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : విశాఖ, హైదరాబాద్‌లోని హెటిరో డ్రగ్స్, సినాప్టిక్సా లేబొరేటరీస్‌లో ఉద్యోగాల భర్తీకి స్థానిక ఎస్‌విఎల్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఎస్సీ కెమిస్ట్రీ ఉత్తీర్ణత పొందినా, పొందకున్నా, ఐటిఐ ఫిట్టర్, ఎలక్ట్రికల్, డిప్లమో ఎలక్ట్రికల్, మెకానికల్ విద్యార్హత ఉండి, 25 ఏళ్లు మించని పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జెకెసి కో-ఆర్డినేటర్ డి.మాధురి (9490584045), ఇంగ్లీష్ అధ్యాపకులు (9848632130)ను సంప్రదించాలని సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : నిర్వహణ పనుల నిమిత్తం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ శేఖరయ్య తెలిపారు. రాయిపాలెం, రేఖవానిపాలెం, మహాలక్ష్మిపురం, బ్యాంక్ కాలనీ, రాజులింగంపేట, దెక్కతిపాలెం, చినబజారు, కృష్ణాకాలనీ, తోటవీధి, అప్పికొండ వీధి, కొంకివీధి, బర్మా కాలనీ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## చందన సమర్పణకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానంలో ఏటా అక్షర తృతీయ చందనోత్సవం రోజున స్వామివారికి సమర్పించే చందనం కోసం పిఠాపురం కాలనీకి చెందిన ఇమ్మంది లక్ష్మీప్రసాద్, రాజేశ్వరి దంపతులు రూ.లక్ష విరాళాన్ని దేవస్థానం అధికారులకు అందించారు.

## ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతం



పరీక్షల అమలును పరిశీలిస్తున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి

**ప్రజాశక్తి- అనకాపల్లి:** నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి బి లింగేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 19 పరీక్ష కేంద్రాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన ఈ పరీక్షల్లో 4315 మందికిగాను 4115 మంది హాజరయ్యారన్నారు. డిఇఒతోపాటుమరో రెండు బృందాలు పరీక్ష కేంద్రాలను తనిఖీలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

## విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ

**ప్రజాశక్తి- కె.కోటపాడు** :మండలంలోని పింద్రంగి, వి. సంతపాలెం, కె.జె.పురం, కూండ్రపూవానిపాలెం గ్రామాల్లో ఆదివారం శ్రీ సత్యసాయి భజన మండళ్ల మండల ఇన్‌చార్జి కన్నూరు అప్పలనాయుడు ఆధ్వర్యంలో సాయిగాయత్రి తండులార్చన నిర్వహించారు. స్థానిక సీతారామాలయంలో సమితి కన్వీనరు బండారు నారాయణపాత్రుడు నిర్వహణలో 'సాయి గాయత్రి మంత్రాన్ని పఠించిన విద్యార్థులకు కొత్తల మధుబాబు, ఆయన కూతురు ఇంజనీరింగ్ విద్యార్థిని కొత్తల రమ్యశ్రీదేవి పెన్నులు, పెన్సిల్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాల వికాస్ గురువులు బండారు రామలక్ష్మి, జేగురుపాటి జ్యోత్స్నలకు శ్రీ సత్యసాయి సేవాదళ్ జిల్లా సమన్వయకర్త కశిరెడ్డి అప్పలనాయుడు, పైలా అమ్మాజీ, కొత్తల మధు జ్ఞాపికలను బహుకరించారు.

## రసవత్తరంగా ఎడ్ల బళ్ల పరుగు పందెం




ఎడ్ల పరుగుపందెం తిలకిస్తున్న ప్రజలు

**ప్రజాశక్తి- దేవరాపల్లి :** మండల కేంద్రంలోని ఉమా మహేశ్వరీదేవి తీర్థం ఆదివారంతో ముగిసింది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం జిల్లాస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు నిర్వహించారు. రసవత్తరంగా సాగిన ఈ పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. విజేతలకు భారీ నగదు బహుమతులను దేవి ఉత్సవ కమిటీ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వరదపు రెడ్డి, సింహాచలం నాయుడు, ఎంపిటిసి మొల్లి కష్ణమూర్తి, కె వి రమణ, వేచలపు అప్పలనాయుడు, పేరు నాయుడు, వాలేటి నాగరాజు, బంధం అప్పలరాజు స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## మాజీ జెడ్‌పిటిసి నూకరాజు మృతి



పొన్నగంటి నూకరాజు

**ప్రజాశక్తి -కశింకోట :** మండలంలోని నరిశింగబిల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, మాజీ జెడ్‌పిటిసి న్యాయ వాది పొన్నగంటి నూకరాజు(55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. నూకరాజు మృతిపై మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సంతాపం వ్యక్తం చేశారు. మండల బిసి నేతగా, జెడ్‌పిటిసిగా పార్టీకి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నూకరాజు మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. మృతునికి భార్య నాగమణి, ఇద్దరు పిల్లలున్నారు.

# 98వ రోజుకు నాబ్ నిర్వాసితుల దీక్షలు



దీక్షల్లో నినాదాలు చేస్తున్న నిర్వాసితులు

**ప్రజాశక్తి - రాంబిల్లి** : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేవల్ బేస్ నిర్వాసితుల చేపట్టిన దీక్షలు ఆదివారం 98 రోజుకు చేరుకున్నాయి. నిర్వాసితుల సమస్యలపై ఎలమంచిలి ఎమ్మెల్యే యువి రమణ మూర్తి రాజు( కన్నబాబు)ను కలిసి జెఎసి నేతలు వివరించగా, ఒక్కో ఫిషింగ్‌బోటుకు రూ.2.50లక్షలు చెల్లిస్తారని, జీవనోపాధి కోల్పోయిన నిర్వాసితులకు, రేషన్ కార్డు ఆధారంగా రూ.1.20లక్షలు ఇవ్వటానికి జిల్లా కలెక్టర్ సుముఖంగా ఉన్నారని ఎమ్మెల్యే చెప్పారని నిర్వాసిత పెద్దలు వెల్లడించారు.. మిగతా నాలుగు గ్రామాల సమస్యలపై అధికారులు సర్వేలు చేసి, వారికి రెండో విడతలో న్యాయం చేస్తారని ఎమ్మెల్యే చెప్పినట్లు జెఎసి పెద్దలు వెల్లడించారు.

కాఆ నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో అంకెల గారడీపై పలువురు ప్రశ్నించారు. గత చర్చల్లో నెలకు రూ.14,300 చొప్పున పది నెలలకు రూ. 1.43లక్షలు ఇస్తామని అంగీకరించిన అధికారులు, ఇపుడు దాన్ని తగ్గించి రూ.1.20లక్షలే ఇస్తామనడం ఏమిటని ఎమ్మెల్యేను ప్రశ్నించామని జెఎసి నేతలు వెల్లడించారు. ఏదేమైనా నిర్వాసితులందరికీ న్యాయం జరిగే వరకుపోరాటాన్ని కొనసాగించాలని నిర్ణయించారు.

## లేనిపోని నిబంధనలతో యువగళానికి మోకాలడ్డు!

### టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్




మాట్లాడుతున్న నాగ జగదీష్

**ప్రజాశక్తి-అనకాపల్లి :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్రకు రాష్ట్ర ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టి, అడుగడుగునా ఆటంకాలు కల్పించడం తీవ్ర ఆక్షేపనీయమని అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు మండిపడ్డారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు ప్రజాస్పందనను చూసి జగన్ రెడ్డికి భయం పట్టుకుందన్నారు. సిబిఐ, ఇడి కేసులతో సతమతమవుతున్న ముఖ్యమంత్రికి వివేకానంద రెడ్డి హత్య కేసు కూడా మెడకు చుట్టుకుంటుందనే గుబులు పట్టుకుందన్నారు. అందుకే దేశంలో ఎక్కడా, ఏ పాదయాత్రకు లేని నిబంధనలన్నీ లోకేష్ పాదయాత్రకు వర్తించేలా పోలీసులు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో పాదయాత్రకు ఆటంకాలు సృష్టించి, లేనిపోని సెక్షన్లతోకేసులు పెట్టి కార్యకర్తలను, యువగళం వాలంటీర్లపై దాడులకు పాల్పడడం దుర్మార్గమన్నారు.

పాదయాత్రలో మైకు వాడొద్దని, ప్రచార రథంపై ఎక్కి ఉపన్యాసాలు ఇవ్వవద్దని చెప్పడం ఎంతవరకు సమంజసం ప్రశ్నించారు. పోలీసులు ఇలాగే వ్యవహరిస్తే రానున్న రోజుల్లో ఖాకీ దుస్తులు వదిలి, ఖైదీ దుస్తులు ధరించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భీమరశెట్టి శ్రీనివాసరావు, బిసి సెల్ పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మళ్ల లోవకృష్ణ పాల్గొన్నారు.

# జనసంద్రమైన పూడిమడక

### సముద్ర స్నానానికి పోటెత్తిన భక్తులు

### కన్నులపండువగా మాఘ పౌర్ణమి జాతర




సముద్ర స్నానానికి వచ్చిన భక్తులతో పూడిమడక సముద్రతీరం

**ప్రజాశక్తి -అచ్యుతాపురం** : మహా మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం పూడిమడక సముద్రతీరంలో స్నానాలు చేయటానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో కిక్కిరిసిపోయింది. శనివారం అర్ధరాత్రి నుంచి, ఆదివారం చీకటి పడేంత వరకు భక్తులు బస్సులు, ఆటోలు, బైక్‌లు ఇతర వాహనాల తోపాటు కాలినడకన కూడా భారీగా తరలివచ్చి సముద్రస్నానాలు ఆచరించారు. సముద్రంలో గంగమ్మ తల్లికి సూర్యభగవానికి నమస్కరించి చిల్లర నాణ్యాలు పసుపు కుంకుమలు అరటిపళ్ళు విసిరి నమస్కరించి స్నానాలు చేశారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సముద్ర స్నానాలు అనంతరం తీరాన ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేకమైన పూజలు చేశారు.

భక్తులరద్దీని దష్టిలో పెట్టుకొని డిఎస్‌పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో అచ్యుతాపురం సిఐ మురళీరావు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. సముద్రంలో తెప్పలపై గజ ఈతగాళ్లను ముందుజాగ్రత్తగా ఉంచారు. పౌర్ణమి జాతర సందర్భంగా తీరంలో ఏర్పాటుచేసిన సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి.

**సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ**

పూడిమడకలో మాఘపౌర్ణమి సందర్భంగాసముద్ర స్నానాలకు వచ్చేవారి దాహార్తిని తీర్చేందుకు సత్య సాయి సేవ సమితి సభ్యులు మజ్జిగ వితరణ చేపట్టారు. పూడిమడక హై స్కూల్ సమీపంలో గ్రామానికి చెందిన గురుకుల జయశంకర్, నాగులపల్లికి చెందిన మల్ల కాశీ ఈశ్వరరావు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు జాతరకు వచ్చే భక్తులకు విష్ణు డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలోఉచితంగా బిపి, ఇతర పరీక్షలు చేశారు.

## నేడు కాంగ్రెస్ పాదయాత్ర

**ప్రజాశక్తి-.అనకాపల్లి :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అనకాపల్లి పట్టణంలో 'చేయి చేయి కలుపుదాం, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం' (హాత్ సే హాత్ జోడో అభియాన్) పాదయాత్ర నిర్వహించనున్నట్లు పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయిన భానుమూర్తి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గుండాలు జంక్షన్ నుంచి రామచంద్ర థియేటర్ జంక్షన్, నెహ్రూ చౌక్ జంక్షన్ మీదుగా ఎల్ఐసి కార్యాలయం వరకు నిర్వహించే పాదయాత్రలో ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొంటారన్నారు. పాదయాత్ర అనంతరం ఆదాని సంస్థలపై హిండెన్ బర్గ్ పరిశోధన నివేదికపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసి కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నేడు సచివాలయ కన్వీనర్లతో సమావేశం

**ప్రజాశక్తి - పరవాడ:** మండలంలో వెన్నలపాలెం కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 9గంటలకు పరవాడ మండలంలోని సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథులతో కీలక సమావేశం నిర్వహించనున్నట్లు వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎంపిపిపైలా వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్, జెడ్‌పిటిసి రాజు, వైస్ ఎంపిపిలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, సీనియర్ నేత చుక్క రామునాయుడు, సిరిపురపు అప్పలనాయుడు, జెఎసి కన్వీనర్ వెన్నల సన్యాసిరావు పాల్గొంటారని తెలిపారు.

## పార్టీ బలోపేతానికి అడ్‌హక్ కమిటీలు

**ప్రజాశక్తి. -సబ్బవరం** : గ్రామాల్లో జనసేన అడ్‌హక్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు పెందుర్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి తమ్మిరెడ్డి శివశంకర్ తెలిపారు. ఆదివారం స్థానిక జనసేన కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ గ్రామ1స్థాయి నుండి పార్టీ బలోపేతం చేసేందుకు ఈ అడ్ హక్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీలో అక్రమ కట్టడాలపై డిపిఒకు, దుమ్ము,ధూళి కాలుష్యం, రోడ్లు పాడౌతుండడంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. నేతలు మామిడి శంకరరావు, కర్రి కనక రాజు, సబ్బవరపు రవి పాల్గొన్నారు.

## 'మత్తుకు బానిసలు కావొద్దు'




ప్రచార ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న పోలీసులు.

**ప్రజాశక్తి- చోడవరం** : మాదక ద్రవ్యాలు వినియోగించి, వాటికి బానిసలై ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని చోడవరం సిఐ బి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సిఐ ఆధ్వర్యంలో స్థానిక కొత్తూరు జంక్షన్‌లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహనకు ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి ఎంతోమంది తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, వాటిని అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలను విక్రయించినట్లు సమాచారం తెలిస్తే తమకు నేరుగా తెలియజేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని శ్రీనివాసరావు తెలిపారు.

## టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా చిరంజీవిరావు ఎంపికపై హర్షం

**ప్రజాశక్తి- కె.కోటపాడు** : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వేపాడ చిరంజీవిరావును పార్టీ అధినేత చంద్రబాబు ఎంపిక చేయడంపై మాడుగుల నియోజకవర్గ టిడిపి నేత పైలా ప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక శాస్త్రవేత్త చిరంజీవి రావు గెలుపునకు తన వంతు కృషి చేస్తానన్నారు.పార్టీ కేడర్‌కూడా పనిచేయాలని కోరారు.

# ఓటమి భయంతోనే లోకేష్ పాదయాత్రకు అడ్డంకులు

## 'కాఫీ విత్ కేడర్'లో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

ప్రజాశక్తి- అనకాపల్లి : కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి ఊపిరి అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని మారేడుపూడి గ్రామంలో 'కాఫీ విత్ కేడర్' కార్యక్రమంలో మాట్లాడుతూ, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు వస్తున్న ప్రజాస్పందనను ఓర్వలేక ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. పోలీస్‌లే వైసిపి కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని, పాదయాత్రలో దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు చేపట్టిన లోకేష్ పాదయాత్ర ఆగదన్నారు. కష్టకాలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రేపాక ప్రసాద్, క్లస్టర్ ఇన్‌ఛార్జి తలారి కాశీ నాయుడు, పార్టీ అధ్యక్షులు బాదపు రాంబాబు, ఈగల వెంకునాయుడు, ఈగల నాయుడు, గొల్లవిల్లి శ్రీను, ఎర్ర కల్యాణ్ రాజు, ఎర్ర అప్పారావు, కరణం రమణ, కరణం కోటి, సూకరాజు, అక్కిరెడ్డి రమణ బాబు, గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

# మూఢ నమ్మకాలకు మన్యవాసులు దూరంగా ఉండాలి

## - సినీ హీరో శ్రీకాంత్




గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న హీరో శ్రీకాంత్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అల్లూరి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు మీకోసం మీ పోలీస్ అనే కార్యక్రమంలో భాగంగా అరకు సిఐ జీడి బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని మాడగడ పంచాయతీ గంగుడి గ్రామంలో మీ కోసం మీ పోలీస్ అనే కార్యక్రమంలో సినీ నటుడు హీరో శ్రీకాంత్, హీరో రాహుల్, హీరోయిన్ శ్రీవాణి ఆదివారం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ, మూఢ నమ్మకాలతో గిరిజనులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, నాటు సారా విక్రయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -అనకాపల్లి : పట్టణంలో దెబ్బతిన్న, తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించే చర్యల్లో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉడ్ పేట, చదువుల వారి వీధి, మల్ల వీధి, కాశీ విశ్వనాథం గుడి ప్రాంతం, వేల్పుల వీధి, చవితిన వీధి, నరసింగరావుపేట, జీవి కోటేశ్వరరావు వీధి, గూడ్స్ రోడ్డు, జార్జి క్లబ్బు శాఖ వీధి, నాగవంశం వారి వీధి, భీమిని గుమ్మం, రైల్వే స్టేషన్ రోడ్డు, వుడ్ పేట చిరంజీవి కాంప్లెక్స్ ఏరియాల్లో విద్యుత్తు నిలిపేయనున్నట్లు తెలిపారు.

## సైబర్ నేరాలు, మోసాలపై అవగాహన

ప్రజాశక్తి -కొయ్యూరు: సైబర్ నేరాలు, మోసాలపై ఆదివారం కొయ్యూరు వారపు సంతకు వచ్చే గిరిజనులకు కొయ్యూరు సిఐ స్వామి నాయుడు, మంప ఎస్ఐ లోకేష్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించి, చైతన్య పరిచారు. కొయ్యూరు, కాకరపాడు, బాలరేవుల, మంప, బూదరాళ్ల, పరిసర ప్రాంతాల నుంచి వారపుసంతకు వచ్చే ప్రజలకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురికాకుండా ఉండాలంటే ఏంచేయాలో, మోసానికి గురైతే చేపట్టాలని చర్యలపై విపులంగా వివరించారు.

## వేధింపుల నుంచి రక్షించరూ..

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉన్నత చదువులు చదువుకొని, ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్న తనను కొన్నాళ్లుగా పొరుగు ఇళ్లకు చెందిన వారు పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తూ, అవమానిస్తూ, మానసిక వేదనకు గురి చేస్తున్నారని చినముషిడివాడ శాంతినగర్‌కు చెందిన శివకుమారి కాలాపురి ఆవేదన వ్యక్తపరిచారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను నివసిస్తున్న ఇంటిని ఆనుకొని ఉన్న చిక్కాల సరస్వతి ఇంటిలో ఉన్న చెట్టు తమ ఇంటి వైపు విరిగి పడిందని చెప్పారు. అందువల్ల తనకు నష్టం జరిగిందన్నారు. ఇదే విషయమై ఆమెను తాను ప్రశ్నించానని తెలిపారు. జరిగిన పొరపాటును అంగీకరించకుండా, తిరిగి ఆమె తనపై తీవ్రస్థాయిలో దౌర్జన్యానికి పాల్పడిందని ఆరోపించారు. దీనిని అదునుగా చేసుకొని తన ఇంటికి అటు ఇటు ఉన్న ఇళ్లకు చెందిన వారు కూడా తనను అదే పనిగా వేధించడం, అవమానించడం చేస్తున్నారని తెలిపారు. వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేశానని, అలాగే తమ కాలనీలో ఉన్న పెద్దలకూ చెప్పానని అన్నారు. అయితే ఏ ఒక్కరూ తనకు న్యాయం చేయలేదని ఆవేదన వెలిబుచ్చారు. ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని, వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరారు.

# ప్రకటనలకే పరిమితమైన వయోవృద్ధుల సంక్షేమం



మాట్లాడుతున్న కెప్టెన్ అప్పారావు

ప్రజాశక్తి -అనకాపల్లి : వయోవృద్ధుల సంక్షేమం విషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు ప్రకటనలకే పరిమితం కావడం విచారకరమని వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కెప్టెన్ అప్పారావు అన్నారు. ఆదివారం స్థానిక వివి రమణ రైతు భారతి సమావేశమందిరంలో సంఘ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ, వయోవృద్ధులకు వైద్యాలయాలు, దేవాలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎఎంఎఎల్ కళాశాల లెక్చరర్ బుద్ధ అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం వయోవృద్ధులకు ఇచ్చిన గుర్తింపు కార్డుకు ఆధార్ కార్డు వలె అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి, రైల్వే ప్రయాణాల్లో రాయితీలు కల్పించాలని, తిరుమల తిరుపతి దేవస్థానంలో వయోవృద్ధులకు ఉచిత దర్శనం ఇస్తున్నట్టే లడ్డూలు, గదుల కేటాయింపుల్లోనూ ఆన్‌లైన్‌లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. సంఘం కోశాధికారి భీశెట్టి కృష్ణ అప్పారావు మాట్లాడుతూ పట్టణంలో వయోవృద్ధులకు వసతి గృహం ఏర్పాటుకు గతంలో ఇచ్చిన వినతిపత్రంపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎఎంఎఎస్ అప్పారావు, మళ్ల చిన్నారావు, బి ప్రసాద్, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, కర్రి జగ్గ అప్పారావు, బుద్ధ రాము పాల్గొన్నారు.

# వైభవంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండల కేంద్రం మునగపాకలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు, సందర్శకులకు అసౌకర్యం కలగకుండా చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, గౌరవాధ్యక్షులు పొలిమేర అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎలమంచిలి ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు, ఎపి గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, ఎంపిపి మల్ల జయలక్ష్మి, జెడ్‌పిటిసి స్వామి సత్యనారాయణ, పలువురు నాయకులు గౌరీపరమేశ్వరులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# జనరాజుదాస్ ఆశయ సాధనకు కృషి



జనరాజుదాస్‌కు నివాళులర్పిస్తున్న గ్రామీణ యువత ప్రతినిధులు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: ఆర్‌ఈసిఎస్ మాజీ చైర్మన్ పెంటకోట జనరాజుదాస్ ఆశాలు, ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గ్రామీణ యువజన మందిరం ఆవరణలో జనరాజుదాస్ 11వ వర్ధంతి పురస్కరించుకుని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామీణ యువజన మందిరం సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము, సీనియర్ కళాకారులు దాడి ముసలినాయుడు, మల్ల సంజీవరావు, కాండ్రేగుల జగ్గారావు మాట్లాడుతూ ఆర్‌ఈసిఎస్ చైర్మన్‌గా, టిడిపి రూరల్ మండల అధ్యక్షునిగా జనరాజుదాసు పార్టీబలోపేతం, అనేక అభివృద్ధి పనులను చేపట్టారన్నారు. మారుమూల ప్రాంతాలకు విద్యుత్తు స్తంభాలు, రహదారుల నిర్మాణాలను చేపట్టారన్నారు. గ్రామంలో కళారంగాన్ని విస్తరించాలనే సంకల్పంతో సినీ దర్శకుడు సత్యానంద్‌తో స్థానిక కళాకారులకు శిక్షణ ఇప్పించారని గుర్తు చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, టెక్కలి వీర కొండలరావు ,పెంటకోట వెంకట్, మల్ల రామ జగన్నాథం, ఏపిఎం సత్యనారాయణ, సూరిశెట్టి శ్రీను, పెంటకోట విష్ణు, జనరాజ్ దాస్ సోదరుడు శ్రీరామ్ పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి గడపగడపకూ..

ప్రజాశక్తి- దేవరాపల్లి: నిత్యం అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు భరోసా నిచ్చారు ఆదివారం మండలంలోని ఎన్‌జి నగరం, వద్రపాలెం గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ,సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం, పాఠశాలను సందర్శించి చిన్నారులు, విద్యార్థులతో ముచ్చటించారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిపై ఇద్దరు విద్యార్థులు అనర్గళంగా ఇంగ్లీష్, తెలుగులో మాట్లాడడంపై సంతృప్తి వ్యక్తం చేసిన ఉపముఖ్యమంత్రి, వారిని ఎత్తుకొని ముద్దాడారు వద్రాపాలెంలో అంబేద్కర్, సరస్వతి విగ్రహాలకు పూలమాలలు వేశారు.

### రాజశేఖరరెడ్డి నిలువెత్తు విగ్రహావిష్కరణ

ఎన్ గజపతినగరంలో ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన వైయస్ రాజశేఖర్‌రెడ్డి నిలువెత్తు విగ్రహాన్ని డిప్యూటీ సిఎం ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యోగాలు చేస్తూ గ్రామాలకు సేవలందిస్తున్న 25 మందిని సత్కరించారు. కార్యక్రమంలో దేవరాపల్లి, కె. కోటపాడు జెడ్‌పిటిసిలు కర్రి సత్యం, ఈర్లే అనురాధ, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, వైస్ ఎంపిపిలు చింతల బుల్లి లక్ష్మి వెంకటరమణ, గంగ భవాని అప్పారావు, సర్పంచులు సిరికి లక్ష్మి, శటార్ నాయుడు, రొంగలి వెంకటరావు, దాడి జగన్, ఎంపిటిసి రెడ్డి శ్రీలక్ష్మి బలరాం, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సింహాచలం నాయుడు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు, కె.వి. రమణ, చిరికి శ్రీనివాసరావు, చిరికి జగ్గు నాయుడు తదితరులు పాల్గొన్నారు




ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న ఉపముఖ్యమంత్రి

## నేడు చౌడువాడలో..

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారని ఎంపిడిఓ కాండ్రేగుల శచీదేవి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారులు, నేతల దృష్టికి తీసుకురావాలని సూచించారు

# పెద్ద మదీనాలో పరదేశమ్మ ఆలయం ప్రారంభం



వేడుకలో పాల్గొన్న ఎంపి సత్యవతి

ప్రజాశక్తి.-బుచ్చయ్యపేట : మండలంలోని పెద్ద మదీనా గ్రామంలో నూతనంగా నిర్మించిన పరదేశమ్మ ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రారంభోత్సవంలో అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి , ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, జెడ్‌పిటిసి దొండ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చునాయుడు విశాఖ డెయిరీ డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతిని పెద్ద మదిన గ్రామస్తులు సన్మానించారు.

## వైఎస్ఆర్ బీమా నమోదుకు

# కార్మిక శాఖ ధ్రువీకరణ తప్పనిసరి

ప్రజాశక్తి-అనకాపల్లి : వైఎస్ఆర్ బీమా పథకం నమోదు చేసుకునే కార్మికులు తమ వృత్తిని, భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికులుగా నమోదు చేసుకుని ఉంటే తప్పనిసరిగా కార్మిక శాఖలో సభ్యత్వం తీసుకోవాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యత్వం పొందని కార్మికులకు వైఎస్ఆర్ బీమా పథకం వర్తించదన్నారు.

# రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యం


మాట్లాడుతున్న ధర్మశ్రీ

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ధర్మశ్రీ**

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్ :రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, చోడవరం ఎమ్మెల్యే ధర్మశ్రీ తెలిపారు. నర్సీపట్నంలో ఎమ్మెల్యే గణేష్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం గొలుగొండ, నర్సీపట్నం మండలాల గృహ సారథులు, వార్డు వాలంటీర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ఇష్టా గోష్టి చర్చావేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పై సమగ్రంగా వివరించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని అధిష్టానం దృష్టికి తెలియజేయాలన్నారు. చంద్రబాబు నాయుడుతో పాటు అతని కుమారుడు లోకేష్ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రజలకు మంచి సేవలను అందించే ఉద్దేశంతో సీఎం జగన్ మోహన్ రెడ్డి కన్వీనర్లను, గృహ సారధులను నియమించారని తెలిపారు. గృహ సారదులకు పార్టీ కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్పర్సన్ ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**పేదలకు సంక్షేమ పథకాలు**

కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోటలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం రెండవ రోజుకు చేరుకుంది. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో స్థానిక ఒకటవ సచివాలయం పరిధిలో రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామంలో మూడు, నాలుగు వార్డులలో ఎమ్మెల్యే పర్యటన సాగింది. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు పై ఆరా తీశారు. అర్హత కలిగిన పేదలకు పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.తనకు రేషన్ కార్డు తో పాటు సామాజిక పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోసిరెడ్డి రాజబాబు కోరగా, తమకు సామాజిక భవన నిర్మాణానికి నిధులు మంజూరు కు కృషి చేయాలనీ స్థానిక నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ కలసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పార్టీలకు, మతాలకు తావు లేకుండా ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ డైరెక్టర్ జి.సత్యదేవ్, గ్రామ సర్పంచ్ కొన లోవరాజు, ఉపసర్పంచ్ పి.దేవ, ఎం పిటిసి సభ్యులు కె.లక్ష్మీ శంకర్, పూడి దేవ, మాజీ ఉపసర్పంచ్ కె.గున్నాజీ, వైసీపీ జిల్లా కార్యదర్శి తలారి ఆదిమూర్తి, శీలం శంకరరావు పాల్గొన్నారు..


పూడికలు తీయిస్తున్న కార్పొరేటర్ సౌజన్య

## కాలువల్లో పూడికతీత పనులు

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:మున్సిపాలిటీ 9వ వార్డు జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య వార్డు పరిధిలోని కాలువల్లో పేరుకు పోయిన చెత్త, పూడికను తన సొంత నిధులు వెచ్చించి ఆదివారం తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 9వ వార్డులో మూడు నెలలుగా చెత్త, కాలువల్లో పూడికలు పేరుకు పోయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదన్నారు. మూడు నెలలుగా జేసిబి మరమ్మతు చేయించలేని పరిస్థితిలో నర్సీపట్నం మున్సిపాలిటీ ఉందన్నారు. కాలువల్లో పూడికలు పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని కౌన్సిల్ సమావేశంలో చైర్ పర్సన్ దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేక పోవడంతో తమ సొంత నిధులు వెచ్చించి కాలువలను శుభ్రం చేయించామన్నారు. ఆమె వెంట నర్సీపట్నం జనసేన టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ ఉన్నారు.


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సుభాష్ చంద్ర బోస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ పాఠశాలలో 1996-97 బ్యాచ్కు చెందిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు రామ్ మోహన్ మాస్టారు చేతుల మీదుగా విగ్రహ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుక్కర శ్రీధర్, ఎడ్ల హేమంత్, పుట్టా సేదుట్, సతీష్, భమిడిపాటి గిరి, పొలిమేర లక్ష్మణరావు ఆధ్వర్యం వహించారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు


హాజరైన వర్మ, చెంగల, నగేష్, తదితరులు

## ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-పాయకరావుపేట:ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.ఆర్.ఎన్ వర్మ కోరారు. స్థానిక పాండురంగ కళ్యాణ మండపం వద్ద యూజెఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత చెంగల వెంకట్రావు, మాజీ గ్రంథాలయ చైర్మన్ తోట నగేష్, జెడ్పిటిసి సభ్యులు లంక సూరిబాబు మాట్లాడుతూ, పాత్రికేయులు సేవా పనులు చేపట్టడం అభినందనీయమన్నారు.యూజెఎఫ్ సేవలను ప్రశంసించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 100 మందికి పరీక్షలు చేసి, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి కళ్యాణి లక్ష్మణరావు, వైద్యులు పాల్ కిరణ్, స్వరాజ్యం, ప్రసాద్, యు.జె.ఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ బీసీ నాయకులు కేసన కుర్రి సత్తిబాబు, కార్యదర్శి మల్లేశ్వరరావు, కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.

## దళితులపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలోని జి వెంకటాపురం శివారు నగరం గ్రామంలో దళితలపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలో ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళితులపై దాడి చేసిన ఇద్దరిని మాత్రమే అరెస్ట్ చేశారని, మిగిలిన ఎనిమది మందిని కూడా అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు అన్ని విధాలుగా రక్షణ కల్పించాలని కోరారు. లేనిపక్షంలో దళిత ప్రజా సంఘాలతో ఆందోళన చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు చలపతి, చిరంజీవి, మల్లేష్ పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఘనంగా పండగలు


పూజలు చేస్తున్న భక్తులు

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలోని బూరుగుపాలెం గ్రామంలో పరదేశమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా స్థానికులు అమ్మవారి జాతరను వైభవంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ వి.వెంకటరమణ, ఎంపీటీసీ రుత్తల యర్రాపాత్రుడు ఏర్పాటు చేసిన విందుకు పలువురు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ముత్యాల పాప, నర్సీపట్నం జడ్పిటిసి సుకల రవణమ్మ, చోడవరం ఇన్చార్జి పైల ప్రసాద్ రావు, వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ డి సూర్యనారాయణ రాజు, పోతన ప్రసాదు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నర్సీపట్నం రూరల్:చెట్టుపల్లిలో గడిచిన ఐదు రోజుల నుండి జరుగుతున్న పైడితల్లమ్మ ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. పైడితల్లి అమ్మవారి గుడి వద్ద కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. పండుగను పురస్కరించుకొని గ్రామంలో మహిళలు భక్తిశ్రద్ధలతో పసుపు కుంకుమలు సమర్పించారు.అమ్మవారి ఘటాలను మేళతాళాలతో ఊరేగించారు.


రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

## దేవవరంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని దేవవరం గ్రామంలో ఆదివారం సర్పంచ్ గొర్ల రాఘవ కుమారి నరసింహమూర్తి ఆధ్వర్యంలో అను హస్పటల్ (విశాఖపట్నం) వైద్య బృందంతో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పాల్ కిరణ్, సుకుమార్, స్టాలిన్, కుమారిలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బిపి, షుగర్, ఈసీజీ, గుండె స్కానింగ్ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. 120 మంది రోగులకు పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు.

## వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వెంకటేశ్వరస్వామిని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన జన్మదినం సందర్భంగా శ్రీవారి అంతరాలయంలో పూజ జరిపించుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఆయన వెంట 8వ వార్డు కార్పొరేటర్ ఎల్.అప్పారావు ఉన్నారు.

## అప్పన్న సన్నిధిలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్

ప్రజాశక్తి-సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామిని రాష్ట్ర దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.రామచంద్రమోహన్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సూపరింటెండెంట్ పిల్ల శ్రీనివాసరావు సాదరంగా స్వాగతం పలికారు. వారు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించగా అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు.

## సజావుగా ఎన్ఎంఎంఎస్ పరీక్షలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ బాలుర పాఠశాలలో జాతీయ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు. . డిపార్ట్ మెంట్ అధికారిగా పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.కృష్ణమూర్తి, చీఫ్ సూపరింటెండెంట్గా తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ బాలుర పాఠశాల హెచ్ఎం రీమలి జాన్ వ్యవహరించారు. పరీక్షా కేంద్రాన్ని డిఇఒ పి.రమేష్ పర్యవేక్షించారు.


పందిరి రాట వేస్తున్న గ్రామ పెద్దలు

## ఘనంగా దుర్గమ్మ పందిరి రాట

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక దుర్గాదేవి ఆలయం వద్ద ఆదివారం ఉదయం ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో పందిరి రాటోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల 11న దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకటరమణ తెలిపారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని ముహూర్తం సమయానికి పందిరి రాట వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మహేష్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ ప్రగడ వీరబాబు, కొల్లాటి బుజ్జి, గురు భవాని దవరసింగి రాంబాబు, గ్రామస్తులు సిద్దాబత్తుల కృష్ణ, దవరసింగి సన్యాసిరావు, కొప్పిశెట్టి లచ్చబాబు, కొంకిపూడి దొరబాబు, కొప్పిశెట్టి జగదీశ్వరరావు, నాగేశ్వరరావు, వరహాలరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుప్పిలి రాజు

## కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ ఛైర్మన్ కుప్పిలి రాజు నర్సీపట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో 70 నుంచి 80 సీట్లల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీ బలోపేతానికి పెద్ద ఎత్తున కాంగ్రెస్ కుటుంబ సభ్యులు కృషి చేయాలని అన్నారు. జిల్లాల వారీగా పర్యటన చేసి పూర్వవైభవానికి కృషి చేస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ పరిస్థితులపై చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు మీసాల సుబ్బన్న, నాయకులు పాల్గొన్నారు.



చదువుతున్న విద్యార్థులు

## గ్రంథాలయాల్లో పుస్తక పఠనం

**ప్రజాశక్తి-గొలుగొండ:** స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్ క్లబ్‌లో భాగంగా బుక్ రీడింగ్, నీతి కథలు చెప్పడం వంటి కార్యక్రమాలను గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

**నర్సీపట్నంటౌన్:** పిల్లల్లో సృజనాత్మకతను గుర్తించేందుకు లైబ్రరీలు ఎంతో దోహదపడతాయని లైబ్రేరియన్ పి.దమయంతి తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో చిల్డ్రన్ క్లబ్ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ ప్రభాకర్‌రావు నూతన కథల పుస్తకాలు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లల్లో పద సంపద అభివృద్ధి చెందేందుకు, జ్ఞాపకశక్తి పెరిగేందుకు లైబ్రరీలు ఎంతో దోహదపడతాయన్నారు. పిల్లలతో పలు మెమరీ ఆటలు ఆడించి ప్రోత్సాహక బహుమతులను అందించారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు

## బుచ్చిరాజుపేటలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

**ప్రజాశక్తి -నక్కపల్లి:** మండలంలోని బుచ్చిరాజుపేట గ్రామంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వహించారు. వైసిపి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గింజాల లక్ష్మణరావు, పిక్కి గంగరాజు, పిక్కి సత్తియ్య, మనబల కొండబాబు, గట్టెం గణేష్, గొర్ల శ్రీను, కాళ్ళ సత్తిబాబు, దూలి అనంతరావు, కొల్లి నూకాలమ్మ, చొప్పా పాప, గొర్ల ప్రసాద్, యలమంచిలి అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

# అస్తవ్యస్తంగా ఉపమాక పుష్కరిణి



ఉపమాక పుష్కరిణి ఇదే..

- పేరుకుపోయిన వ్యర్థాలు
- కలుషితమైన నీరు
- పట్టించుకోని టిటిడి అధికారులు

**ప్రజాశక్తి-నక్కపల్లి:** మండలంలో ఉపమాక పుష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరిస్తే పుణ్యం మాట దేవుడెరుగు అంటువ్యాధులు ప్రబలడం ఖాయం. ప్రాచీన పుణ్య క్షేత్రమైన ఉపమాక వేంకటేశ్వరస్వామి బంధర సరస్సు అంటే ఒక పవిత్రమైన పుష్కరిణి. పుష్కరిణిలో కాళ్ళు కడుక్కుని, నెత్తిపై కొన్ని జలాలు జల్లుకుంటే సకల పాపాలు హరిస్తాయని, పుణ్యం వస్తుందని భక్తుల విశ్వాసం. గతంలో పుష్కరిణి చాలా ఆహ్లాదకరంగా దర్శనమిచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించలేదు. నాచు మొక్కలు, గడ్డి, ఇతర వ్యర్థాలు, ప్లాస్టిక్, చెత్త గుడ్డలతో నిండి, నీరంతా కలుషితమై దుర్వాసన వెదజల్లుతోంది. గతంలో స్వచ్ఛమైన నీటితో నిండుకుండలా దర్శనమిచ్చిన పుష్కరిణి నేడు వ్యర్థాలతో నిండి అధ్వానంగా ఉండటంతో భక్తులు జీర్ణించుకోలేక పోతున్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు పుష్కరిణిలో స్నానాలు ఆచరించి, స్వామిని దర్శించుకుంటారు. గ్రామస్తులు కూడా చెరువులో స్నానాలు ఆచరించే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చెరువులలో కాలు పెడితే రోగాలు అంటుకునేలా వుంది. ఉపమాక వెంకన్న ఆలయాన్ని మరింతగా అభివృద్ధి పరచడానికి 2015 నవంబర్ 18న అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానంలోకి విలీనం చేసారు. టిటిడి అధికారులు ఆలయాన్ని స్వాధీనపరుచుకున్న తరువాత రెండు, మూడేళ్ల వరకు స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు, సేవలు, ఇతర కార్యక్రమాలతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో టిటిడి మార్కు కనిపించింది. భక్తులతో పాటు గ్రామస్తులు ఉపమాక వెంకన్న ఆలయం అభివృద్ధి చెందుతుందని భావించారు. ఆ తర్వాత ఆలయ అభివృద్ధిపై టిటిడి అధికారులు శీతకన్ను వేసారు. ముఖ్యంగా పుష్కరిణి అభివృద్ధిపై దృష్టి సారించలేదు. పుష్కరిణిలో కలుషితమైన నీరు, వ్యర్థాలను తొలగించకుండానే పుష్కరిణి చుట్టూ లక్షలాది రూపాయిలు వ్యయంతో రాతి కట్టడాలు చేపట్టి, ఐరన్ గ్రిల్స్ మాత్రం ఏర్పాటు చేసారు. చెరువులో ఉన్న కలుషిత నీరు తొలగించాలని స్థానికులు చెప్పినప్పటికీ, టిటిడి అధికారులు పెడచెవిన పెట్టారు. స్వామి వారి వార్షిక కల్యాణం తిలకించడానికి రాష్ట్రం నలుమూలల నుండి వేలాది మంది భక్తులు తరలివస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల్లో చాలా మంది పుష్కరిణిలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుంటారు. మూడేళ్ల నుంచి చెరువు అధ్వానం గా ఉండటంతో భక్తులు స్నానాలు ఆచరించడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే భక్తులు, గ్రామ పెద్దలు, అఖిల పక్ష పార్టీల నేతలు చెరువు శుభ్రం చేయాలని కోరుతూ టిటిడి అధికారులకు అనేక సార్లు వినతిపత్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కూడా పుష్కరిణి సమస్య పై టిటిడి అధికారులకు చెప్పారు. టిటిడి అధికారులు చెరువును గాలికొదిలేసారు. స్వామి వార్షిక కల్యాణవాలు సమీపిస్తున్నాయి. మార్చి 2వ తేదీ నుండి స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి.చెరువు చూస్తే చాలా అపరిశుభ్రంగా ఉండి, కనీసం కాలు పెట్టలేని స్థితిలో ఉంది. సంబంధిత అధికారుల్లో చలనం మాత్రం కనిపించలేదు. ఇప్పటి వరకు చెరువు పరిశుభ్రతపై పట్టించుకోలేదు. ఇప్పటికైనా స్పందించి చెరువును పరిశుభ్రం చేయించాలని భక్తులు కోరుతున్నారు.



పుష్కరిణిలో చెత్తా చెదారం

# అటు ప్రజా సేవ...ఇటు క్రీడా మెరుపులు

**బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ**

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఓ పక్క ఎల్లవేళలా తన వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ.. మరో పక్క జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా రాణిస్తూ విశాఖ పేరు ప్రఖ్యాతలను దేశవ్యాప్తం చేస్తున్నారు జివిఎంసి 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ. ఆమె వార్డు ప్రజాప్రతినిధిగా సమస్యల పరిష్కారానికి అహర్నిశలూ కృషి చేస్తూనే.. మరోవైపు క్రీడల్లో మెరుపులు మెరిపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ - 2023లో 45 ఓ కేటగిరీలో సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో విజేతగా నిలిచారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి స్త్రీ, పురుషుల విభాగాలలో జరిగిన ఈ పోటీల్లో రెండు విభాగాల్లోనూ ఆమె ప్రథమ స్థానంలో నిలిచి శభాష్ అనిపించుకున్నారు. రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్న ఆమె వచ్చే నెలలో గోవాలో జరగబోయే నేషనల్ ఛాంపియన్‌షిప్‌కు ఎపి నుంచి ప్రాతినిథ్యం వహించనున్నారు.



## మణికంఠస్వామికి సత్కారం

**ప్రజాశక్తి పాయకరావుపేట:** వైస్ ఎంపీపీ 2 ఎన్నికైన పల్లెల మణికంఠ స్వామినీ మాజీ ఎమ్మెల్యే వైసీపీ నేత చెంగల వెంకట్రావు అభినందించారు. పాయకరావుపేట వైస్ ఎంపీపీ 2గా నరసాపురం ఎంపీటీసీ పల్లెల మణికంఠ స్వామి ఎన్నికైన సంద ర్భంగా స్థానిక జిల్లా పరిషత్ అతిథి వసతి గృహంలో మణి కంఠ స్వామిని ఘనంగా సత్కరిం చి అభి నందనలు తెలి యజేశారు.



సత్కరిస్తున్న చెంగల

# తీరం.. జనసంద్రం

- -పోటెత్తిన భక్తులు
- -ఘనంగా మాఘ పౌర్ణమి వేడుకలు



రేవుపోలవరం తీరంలో పోటెత్తిన భక్తులు

**ప్రజాశక్తి-ఎస్.రాయవరం:** మండలంలోని తీరప్రాంత గ్రామమైన రేవుపోలవరంకు భక్తులు పోటెత్తారు. నక్కపల్లి, యలమంచిలి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల నుండే కాక ఏజెన్సీ ప్రాంతాల నుండి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నక్కపల్లి సిఐ నారాయణరావు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రయాణీకుల సౌకర్యార్థం నర్సీపట్నం ఆర్టీసి అధికారులు బస్సులను ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు సేవాకార్యక్రమాలు చేపట్టాయి.

**నక్కపల్లి:** మండలంలోని బోయపాడు, దొండవాక సముద్ర తీరాల్లో జనసందోహం కనిపించింది. ఆదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సముద్ర తీరాల్లో స్నానాలు ఆచరించారు. పలు ప్రాంతాల నుండి జనం తరలి రావడంతో సముద్ర తీరం జనం రద్దీతో కిటకిటలాడింది. మాఘ పౌర్ణమి సందర్భంగా సముద్ర తీరాల్లో చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని, వ్యాపారాలు సాగించారు.

**పాయకరావుపేట:** మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని పెంటకోట తీర ప్రాంతంలో అధిక సంఖ్యలోని భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా చిక్కాల యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేపట్టారు.



స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



వడ్డిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

## ఆలయంలో అన్నసమారాధన

**నర్సీపట్నం టౌన్ :** మాఘ పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం లో అన్న సమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వాసవి క్లబ్ పిఎన్‌టిలు సుతాపల్లి శ్రావణ్, చైతన్య, వినాయక రామకృష్ణ ఆధ్వర్యాన నిర్వహించారు. సుమారు 50 మందికి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, పుట్టిన, పెళ్లి రోజుల సమయంలో దాతలు ముందుగా ఆలయ కమిటీకి తెలియజేస్తే అన్నదానానికి సమకూరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దేవత కామేష్, జాలుమూరి జోగారావు తదితరులు పాల్గొన్నారు.